www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 209 | శుక్రవారం | 10 జనవరి, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681




## జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

- బకాయిల చెల్లింపు కోసం డిమాండ్
- పెట్రోల్ పోసుకుని కొందరు ఆత్మహత్యాయత్నం
- కాంట్రాక్టర్లతో చర్చించిన కమిషనర్ ఇలంబర్తి

03



## పంచాయతీ ఉద్యోగులకు

# గుడ్‌న్యూస్

### నెలనెలా జీతాలు చెల్లించాలని సీఎం ఆదేశం

- రాష్ట్రవ్యాప్తంగా 92,351 ఉద్యోగులు
- ప్రతినెలా 116 కోట్లు సర్కారుపై భారం
- గ్రీన్‌ఛానల్ ద్వారా చెల్లించేందుకు చర్యలు

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెలనెలా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, వారికి ప్రతి నెలా రూ. 116 కోట్లు జీతాలు చెల్లించాల్సి ఉండగా, వారందరికీ ప్రతినెలా గ్రీన్‌ఛానల్ ద్వారా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పనులపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులను తొందరగా చెల్లించాలని ఈ

మిగతా 2 లో

02



## సీఎం విదేశీ పర్యటన రద్దు



## మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

- బెయిల్ విచారణ ముగిసేవరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం

02



## విద్యాశాఖ సెక్రెటరీగా యోగితా రాణా

.. 2లో



## ఒక్కో సినిమాకు ఒక్కో తీరా?

- గేమ్ ఛేంజర్‌కు ఎందుకు అదనపు షోలు?
- సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఫైర్

03

## హరీశ్‌రావు గృహ నిర్బంధం

03



## అమల్లోకి వచ్చిన భూ భారతి

- బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్
- సత్వర అమలుకు చర్యలు తీసుకుంటాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి

02



## ప్రవాసీ భారతీయ రైలు షురూ

జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

.. 3లో



## ఇస్రో స్పేడెక్స్ మిషన్ ప్రక్రియ మళ్లీ వాయిదా

02

## మరోసారి ఎన్‌కౌంటర్

- ముగ్గురు నక్సల్స్ హతం



02

# ముగిసిన కేటీఆర్ విచారణ

### ఆరున్నర గంటలపాటు విచారించిన అధికారులు



- నిధుల మళ్లింపుపై ముగ్గురు అధికారుల ఆరా
- విచారణ సమయంలో హాజరైన అడ్వకేట్ రామచంద్రరావు
- రేవంత్ ప్రశ్నలనే ఏసీబీ అడిగిందన్న కెటిఆర్

02

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు లో కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కా గా.. దాదాపు ఆరున్నర గంటలపాటు ఏసీబీ అధికారులు చేసిన విచారణ ముగిసింది.

## సుప్రీంలో కేటీఆర్‌కు చుక్కెదురు

- క్వాష్ పిటిషన్ అత్యవసర విచారణకు నో
- 15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా

02



03

## తిరుపతి ఘటనలో నిర్లక్ష్యానికి మూల్యం

- డీఎస్పీ రమణకుమార్.. గోశాల డైరెక్టర్‌పై వేటు
- ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో బదిలీ
- ఇవో సహా అధికారుల తీరుపై చంద్రబాబు ఆగ్రహం

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# విద్యాశాఖ సెక్రెటరీగా యోగితా రాణా



**ప్రజానావ, హైదరాబాద్:** విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా నియమితులయ్యారు. 2003 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణా.. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా భాద్యతలు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాశాఖ సెక్రెటరీగా ఉన్న బుర్రా వెంకటేశంను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. దీంతో ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా యోగితా రాణాను సెక్రెటరీగా నియమించడంతో శ్రీధర్‌ను ఆ బాధ్యతల నుంచి విద్యాశాఖ రిలీవ్ చేసింది. కాగా, ఎన్. శ్రీధర్‌కు గనుల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా 2006 బ్యాచ్‌కు చెందిన కే. సురేంద్ర మోహన్‌ను రవాణా శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. యోగితా రాణా.. 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2002లో సివిల్ సర్వీసెస్‌లో మూడో ప్రయత్నంలో ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో విశాఖ జిల్లాలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశారు. ఆ తర్వాత యూఎన్‌డీపీలో మూడున్నరేండ్లు బాధ్యతలు నిర్వహించారు. 2017లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ 'ఈ–నామ్' అమలులో జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

# తిరుపతి ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

## మృతుల కుటుంబాలకు ముర్ము, మోడీల సంతాపం



**న్యూఢిల్లీ:** బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో చాలామంది మరణించారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ముర్ము ఎక్స్ పై ఒక పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ పై ఒక పోస్ట్‌లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది. 'ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. తమ సన్నిహితులను మరియు ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల నా సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది.' అని పేర్కొన్నారు. తిరుమల కొండలపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం బుధవారం రాత్రి వందలాది మంది భక్తులు పోటీ పడుతుండగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.

# చత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

## ముగ్గురు నక్సల్స్ హతం




**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, నక్సలైట్ల కు మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా–బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

# ఇస్రో స్పేడెక్స్ మిషన్ ప్రక్రియ వాయిదా

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్?ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది. కాగా ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది.

# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

**ప్రజానావ, ఖైరతాబాద్:** 'భూ భారతి–2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం



డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. ఈరోజు భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ – 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ర్వోఆర్–2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.



# పంచాయతీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా సీఎం ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని, వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని చెప్పారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాబట్టుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి కే జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

## బెయిల్ విచారణ ముగిసేవరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతోందని, ఆ విచారణ ముగిసేంతవరకు మోహన్‌బాబును అరెస్ట్ చేయవద్దని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసుపై ముందస్తు బెయిల్ మంజూరుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మోహన్ బాబు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జర్నలిస్ట్ పై దాడి కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ మెహన్ బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని అందుచేత తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు నుంచి తనకు సానుకూల తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుకున్నట్టుగానే గురువారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

# సీఎం విదేశీ పర్యటన రద్దు

**ప్రజానావ, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దయ్యింది. 14న రేవంత్ ఢిల్లీకి వెళ్లనున్నారు. 15, 16వ తేదీల్లో ఢిల్లీ పర్యటన కొనసాగనుంది. 15న ఢిల్లీలో జరిగే ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. 16న పలువురు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి అభ్యర్థించనున్నారు. అనంతరం 17న ఢిల్లీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌కు వెళ్లనున్నారు. 17, 18వ తేదీల్లో సింగపూర్‌లో సీఎం రేవంత్ పర్యటిస్తారు. 19న సింగపూర్ నుంచి దావోస్‌కు ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. 23వ తేదీ వరకు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు. విదేశీ పర్యటనకు రేవంత్‌రెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జూలై 6వ తేదీ లోపు తిరిగి పాస్ పోర్టును అప్పగించాలని ఆదేశించింది. ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు రేవంత్‌రెడ్డి విదేశాల్లో పర్యటించనున్నారు.

# సుప్రీంలో కేటీఆర్‌కు చుక్కెదురు

**న్యూఢిల్లీ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈ నెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు. అయితే ఈరోజు కేటీఆర్ తరపు న్యాయవాదులు సీజేఐ ధర్మాసనం ముందు హాజరై.. ఇది చాలా సున్నితమైన అంశమని.. కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న ఈరోజు లేదా రేపు విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఫార్ములా కేసులో ముగిసిన కేటీఆర్ విచారణ

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా.. దాదాపు ఆరున్నర గంటలపాటు ఏసీబీ అధికారులు చేసిన విచారణ ముగిసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించడానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరిగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను

- ఆరున్నర గంటలపాటు విచారించిన అధికారులు
- నిధుల మళ్లింపుపై ముగ్గురు అధికారుల ఆరా
- విచారణ సమయంలో హాజరైన అడ్వకేట్ రామచంద్రరావు
- రేవంత్ ప్రశ్నలనే ఏసీబీ అడిగిందన్న కెటిఆర్



అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్–న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి.

దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
10 జనవరి 2025



# హామీలపై నిరంతరం నిలదీస్తాం

- ఫార్ములా-ఈ కారు రేసు ఒక్క రూపాయి అవినీతి జరగలేదు
- ఏసీబీ విచారణకు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్



**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. మాజీ ఏఏజీ, న్యాయవాది రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు వెళ్లారు. అంతకుముందు నందినగర్‌లోని తన నివాసంలో లీగల్ టీమ్‌తో చర్చించారు. అందేవిధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. కాగా, కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళ్తుండటంతో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ బిడ్డగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఒక కార్యకర్తగా, కేసీఆర్ సైనికుడిగా స్వచ్ఛమైన మనసుతో, నిర్మలమైన హృదయంతో మరోసారి చెబుతున్నా.. తెలంగాణ ప్రతిష్ట పెంచడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపడానికి రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశానన్నారు. అవి ఫలించి హైదరాబాద్, తెలంగాణ భారత దేశంలోనే ఒక ప్రధానమైన నగరంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి తీసుకొచ్చేలా పనిచేశాం. తొమ్మిదిన్నర పదేండ్ల తమ ప్రభుత్వంలో మా బావమర్దులకు రూ.11 వందల 37 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చే దౌర్భాగ్యపు పని చేయలేదని తెలిపారు. మంత్రిగా నేను మంత్రిమండలిలో కూర్చుని నా కొడుకు కంపెనీలకు కాంట్రాక్టులు ఇచుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టులు ఇచ్చి ప్రతిఫలంగా ల్యాండ్‌క్రూజర్ కొనుక్కోలేదు. ఆ పనులు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు చేశారన్నారు. ఆ చావు తెలివితేటలు, అవినీతి తెలివితేటలు వాళ్లకే ఉన్నాయని పేర్కొన్నారు. నేను రూ.55 లక్షతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి పోయి దొరికిపోయిన దొంగను కూడా కాదని తెలిపారు. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డఅని తేల్చిచెప్పారు. ఏ పనిచేసినా తెలంగాణ కోసం, హైదరాబాద్ ప్రతిష్టను పెంచడానికి చేశానని తెలిపారు. అరపైసా అవినీతి చేయలేదని, చేయబోను అని అన్నారు. కొంత మంది అర్థమై కానివాళ్లు, తెలిసీ తెలియని వాళ్లు, ఏదో కొంత బురదజల్లి తాత్కాలికంగా మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకునే కాంగ్రెస్ వాళ్లకు చెప్పేదొకటే.. నిజం నిలకడమీద తెలుస్తుందన్నారు. మీరు ఇవ్వాళ జల్లే బురద నన్నుగానీ, మా పార్టీని కానీ ఎట్టి పరిస్థితుల్లో మాధృష్టిని మరల్చలేదన్నారు. మేము మాట్లాడుతూనే ఉంటాం. కొట్లాడుతూనే ఉంటాం. గత ఏడాది కాలంగా విద్యుత్ చార్జీలు పెంచొద్దని కొట్లాడింది బీఆర్ఎస్. లగచర్లలో రైతులను జైల్లో పెడితే అడ్డుకున్నది బీఆర్ఎస్. హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడితే అడ్డుకున్నది బీఆర్ఎస్. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే అడుగడుగునా నిలదీసింది కేసీఆర్ బృందం. మా దృష్టిని మేం మరల్చం. నామీద కేసుపెట్టి నన్నేదో చేసి దానివల్ల మా పార్టీ క్యాడర్‌ను, నాయకత్వాన్ని నువ్వు దారి మళ్లింపు, దృష్టి మళ్లింపు దిశగా ప్రయత్నం చేస్తానని అనుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి. అది నీవల్ల కాదు. ముమ్మాటికీ నువ్విచ్చిన 420 హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇదే కాదు ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటాం. న్యాయస్థానాలపై, ఈ దేశంలోని చట్టాల మీద, భారత రాజ్యాంగంపై మాకు సంపూర్ణ గౌరవం, విశ్వాసం ఉన్నది. నువ్వు ఏ ప్రశ్నలన్నా అడుగు సమాధానం మావద్ద ఉంది. ఎందుకంటే మేం నిజాయితీగా ఉన్నాం. నీలాగా లుచ్చా పనులు చేయలేదు, తుచ్ఛపు పనులు చేయలేదు. చేయబోము. నికార్సయిన తెలంగాణ బిడ్డగా.. కేసీఆర్ రక్తం పంచుకుని పుట్టిన కొడుకుగా చెబుతున్నా.. తెలంగాణ కోసం అవసరమైతే చస్తాను తప్ప ఇలాంటి లుచ్చాల ముందు తల వంచను. తప్పకుండా కొట్లాడుతూనే ఉంటా. పోరాడుతూనే ఉండా. తెలంగాణ జయించేదాకా, కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణ బయటకు వచ్చేదాకా కొట్లాడుతూనే ఉంటా'నని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఒక్కో సినిమాకు ఒక్కో తీరా?

## గేమ్ ఛేంజర్‌కు ఎందుకు అదనపు షోలు?

### సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఫైర్




**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి నిరూపితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గేమ్ ఛేంజర్ సినిమాకు ఎందుకు అదనపు షోలు..? టికెట్ రేట్ల పెంపు ఎందుకు..? అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు, అదనపు షోలకు అనుమతిస్తూ జారీ చేసిన జీవోతో రేవంత్ రెడ్డిది రెండు నాల్కల ధోరణి అని అర్థమైపోయింది. టికెట్ల పెంపుదల ఉండదు అని అసెంబ్లీ సాక్షిగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఆయన ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారు. ఈ జీవోపై వివరణ ఇవ్వాలి. గేమ్ ఛేంజర్ సినిమా వచ్చేసరికి రేట్ల పెంపుదలకు అవకాశం ఇచ్చారు. ఆయనకు ప్రత్యేకమైన ప్రివిలేజ్ ఎందుకు..? ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు షోలు ఉండవని సీఎం నెల రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించారు. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు ప్రివిలేజ్ ఇస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. నిజానికి దిల్ రాజు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడు కూడా కలిసి రాలేదు. ఏ ఒక్క రోజు కూడా తెలంగాణకు అండగా నిలబడలేదు. సంక్రాంతికి వస్తున్నాం ఫంక్షన్‌లో తెలంగాణ కల్చర్‌ను దిల్ రాజు అవమానించాడు. ఆయనకు ఆంధ్రాలోనే సినిమాలకు వైబ్ ఉంటుందట. తెలంగాణలో వైబ్ ఉండదట. అయితే తెలంగాణలో సినిమాలు మానుకో దిల్ రాజు. కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకో.. ఇక్కడ వైబ్ ఉంటుంది. నీకు కావాల్సింది వైబ్ కదా. ఇక్కడి సినిమాలకు వైబ్ ఉండదని అంటున్నవ్ కదా.. అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. సినిమా టికెట్ రేట్లు పెంచమన్న రేవంత్ రెడ్డి పూటకోమాట మార్చుతున్నాడు. సినిమాటోగ్రఫి శాఖ మంత్రి టికెట్ రేట్ల పెంపుదల ఉండదని ప్రకటించారు. మరి దీనిపై సమాధానం చెప్పాలి. సినిమాలు విడుదలైతే టికెట్ రేట్లు పెంచి పేద ప్రజల జేబులు లూటీ చేయొద్దన్నాడు రేవంత్ రెడ్డి. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు పెంచాల్సిన అవసరం వచ్చింది. నిజాయితీ లేని ముఖ్యమంత్రి, మంత్రులు ఉండటం దురదృష్టకరమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు.



# తిరుపతి ఘటనలో నిర్లక్ష్యానికి మూల్యం

- డీఎస్పీ రమణకుమార్.. గోశాల డైరెక్టర్‌పై వేటు
- ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో బదిలీ
- ఇవో సహా అధికారుల తీరుపై చంద్రబాబు ఆగ్రహం

**ప్రజానావ, తిరుపతి:** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై తితిదే పరిపాలన భవనంలో సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. 'డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం అని ప్రకటించారు. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం' అని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.. ఈ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేకపోతున్నారు.. ఘటనపై ఆరా తీసినప్పటి నుంచి సమీక్ష సమావేశం వరకు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూనే ఉన్నారు.. టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం.. ఇంకా కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. బాధితులను పరామర్శించిన సీఎం చంద్రబాబు.. ఆ తర్వాత టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. తొక్కిసలాట ఘటనతో పాటు రేపటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కూడా చర్చించినట్టుగా తెలుస్తుండగా.. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకన్న చౌదరీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, ఎస్పీ సుబ్బారాయుడు, మంత్రులు సత్యకుమార్, నిమ్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.. తొక్కిసలాట సహా జరిగిన ఘటనలపై 40 నిమిషాలకుపైగా చర్చించారు.. అయితే, టీటీడీ ఉన్నాధికారుల తీరుపై చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు .. సమీక్షలో టీటీడీ ఈవోపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.. అజాగ్రత్తగా ఉండడం వల్లే ఇంతటి దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని ప్రక్షాళన చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు.. అసలు దర్శన టోకన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎందుకు పెట్టలేదు..? అని సమావేశంలో నిలదీశారు.. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.





# హరీశ్‌రావు గృహ నిర్బంధం

## కోకాపేటలోని గృహం వద్ద మోహరించిన పోలీసులు

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది. అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

# జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ల ధర్నా

## బకాయిల చెల్లింపు కోసం డిమాండ్

## పెట్రోల్ పోసుకుని కొందరు ఆత్మహత్యాయత్నం

## కంట్రాక్టర్లతో చర్చించిన కమిషనర్ ఇలంబర్తి




**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్లంతా ధర్నాకు దిగారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయలు రూ. 1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో ఓ కాంట్రాక్టర్.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పూనుకొన్నాడు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు.. అతడి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్‌ఎంసీ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. ఇంతలోనే ఉన్నట్టుండి ఇద్దరు కాంట్రాక్టర్లు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కాంట్రాక్టర్లు వారిని అడ్డుకుని పెట్రోల్ బాటిళ్లను లాగేసుకున్నారు. అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లను చర్చలకు పిలిచారు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన మోదీ

**భువనేశ్వర్:** విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి



పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హోటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.



# టీటీడీ నిర్లక్ష్యానికి పరాకాష్ట!

తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టీటీడీ నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు.. వేలమంది పోలీసులు.. ఇంతమంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమిక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు. తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డరు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఇక్కడ భక్తులను అదుపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కానీ, తగిన పోలీసు సిబ్బంది కానీ లేదని అర్థం అవుతోం. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేకుండా టిటిడి అధికారులు వ్యవహరించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇకపోతే సాధారణ రోజుల్లో కూడా తిరుమలలో కంపార్టుమెంట్లలో కూచోబెట్టడం, ఒక్కసారిగా వదలడం, తోపులాట జరిగేలా చేస్తున్నారు. తిన్నగా భక్తులు స్వామిని దర్శించుకునే పరిస్థితి లేదు. తిరుమల విధానాల్లో సంస్కరణలు రావాలి. నేరుగా వచ్చే భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండాలి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ విధానం బలపడాలి. శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులను కూడా క్యూలో తోసేస్తున్నారు. వారు టిక్కుట్లు పొందాక సరైన వసతి కల్పించడం లేదు. వసతి కోసంమరోచోటికి పరుగెత్తాలి. అక్కడ రాజముద్ర వేసుకున్నాక మరోచోటికి పరుగెత్తాలి. ఇలాంటి గందరగోళం లేకుండా సింగిల్ విండో విధానంలో దర్శనం, వసతి టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే తాజా దుర్ఘటన నేపథ్యంలో తిరుమలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

# తిరుపతి ఘటనపై భిన్న వాదనలు

- డీఎస్పీ అత్యుత్సాహంతోనే..
- తగినంత మంది పోలీస్ సిబ్బంది లేకపోవడంతో దుర్ఘటన



**ప్రజానావ, తిరుపతి:** పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భావించిన వారు టోకెన్లు తీసుకునే లోపే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ తీవ్రంగా కలిచి వేసింది. అసలు ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పు ఎవరిదనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. టోకెన్లు తమ వరకూ రావేమో అని కొందరు భక్తులు అత్యుత్సాహం ఓ కారణమంటూ కొందరు వాదిస్తున్నారు. అయితే, అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా తగిన రీతిలో అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. పోలీసుల అత్యుత్సాహం కూడా దీనికి కారణమని భావిస్తున్నారు. ఓ సెంటర్ వద్ద భక్తురాలు అస్వస్థతకు గురి కావడంతో డీఎస్పీ గేట్లు తెరవడంతోనే తోపులాట జరిగిందని ఇప్పటికే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక అందజేశారు. 'తొక్కిసలాట జరిగినా డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాలైనా అతను అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు.' అని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను టీటీడీ ఛైర్మన్ సహా ఈవో, జేఈవో, ఇతర అధికారులు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 48 మంది గాయపడగా.. 40 మందిని డిశ్చార్జి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 8 మంది చికిత్స పొందుతున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల వద్ద తాకిడి తక్కువగా ఉంటుందని భావించిన భక్తులు బుధవారం ఉదయం పదింటికే అక్కడికి చేరుకున్నారు. రాత్రికి పరిసర ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్కులోకి భక్తులను వదిలి.. రాత్రి 8:20 గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. కొంతసేపు భక్తులను నిలిపేసి సహాయ చర్యలు చేపట్టారు. దీంతో ప్రాణనష్టం తగ్గింది. గాయపడ్డ భక్తులను అంబులెన్సులో పోలీసులు రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఈ కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. భక్తులను పార్కులో ఉంచి ఒకేసారి అనుమతించడంతో ప్రాణనష్టం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీటీడీ అధికారులు ఏర్పాట్లలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలు - భక్తులతో నిండిన పార్కు అదుపు చేసేందుకు పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. సాయంత్రం 7 గంటలకు - పార్కు పూర్తిగా నిండిపోవడంతో ఎవరూ ఎటూ కదల్లేని పరిస్థితి నెలకొంది. రాత్రి 8:20 - పార్కు నుంచి టికెట్ల జారీ కౌంటర్లోకి అనుమతించడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఒక్కసారిగా తోసుకుని రావడంతో ప్రాణ నష్టం జరిగింది. రాత్రి 8:40 - సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సులు.. తిరుపతి స్విమ్స్, రుయా ఆస్పత్రులకు క్షతగాత్రులను తరలించారు. ఎస్పీ సుబ్బారాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తిరుపతి తొక్కిసలాట ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం రాత్రి ఎటుచూసినా బాధితుల ఆర్తనాదాలు, బాధితులకు పోలీసులు, స్థానిక భక్తులు సీపీఆర్ చేసిన దృశ్యాలే కనిపించాయి. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. 48 మందికి గాయాలయ్యాయి. అయితే, ఘటనకు పోలీసుల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమని.. సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బుధవారం సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది. జీవకోన, బైరాగిపట్టెడ, శ్రీనివాసం, అలిపిరి ప్రాంతాల్లో తొక్కిసలాట జరిగింది. తొలుత జీవకోన వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్వల్ప తోపులాట జరగ్గా.. రాత్రి 7 గంటల సమయంలో భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించబోయారు. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా ఒకరినొకరు తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగింది. ఎస్పీ సుబ్బారాయుడు అక్కడికి వెళ్లి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిందని భావిస్తుండగానే.. ఎక్కువ మంది భక్తులుండడంతో అధికారులు వారిని పక్కనే ఉన్న శ్రీ పద్మావతి పార్కులోకి అనుమతించారు. బుధవారం రాత్రి 8:15 గంటల సమయంలో పార్కులో ఉన్న ఓ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఆయనకు వైద్యం అందించేందుకు అధికారులు గేట్లు తెరవబోయారు. అయితే, క్యూలైన్లలోకి వదిలేందుకే గేట్లు తెరుస్తున్నారని భావించిన కొందరు ఒక్కసారిగా దాన్ని బలంగా తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో చాలామంది భక్తులు కింద పడిపోయారు. ఈ క్రమంలో ఊపిరాడక పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సమయానికే నలుగురు మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలోనే ఆరుగురు చనిపోయారు. అటు, సమాచారం అందుకున్న వెంటనే టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. గతంలో బారికేడ్లను ఏర్పాటు చేసి అక్కడ పరిస్థితిని అనుసరించి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించేవారు. ఎన్నడూ లేని విధంగా బైరాగిపట్టెడ టోకెన్ల కేంద్రం వద్ద ఉన్న పార్కులోకి భక్తులను అనుమతించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అక్కడే కూర్చుని ఉండడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పార్కులో ఎక్కువ మంది ఉండడం.. వారంతా ఒక్కసారిగా వెలుపలికి వచ్చేందుకు గేటును తోయడంతో కిందపడిపోయారు. ఇదే తొక్కిసలాటకు దారి తీసిందని సమాచారం.

## క్షతగాత్రులకు ఈవో పరామర్శ

### ఘటనపై విచారణ జరుగుతోందని వెల్లడి

**ప్రజానావ, తిరుపతి:** తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి పద్మావతి మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీటీడీ ఈవో శ్యామలారావు గురువారం ఉదయం పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్తితిపై వైద్యుల బృందంతో ఈవో ఆరా తీశారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ... తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. దాదాపు 41 మంది గాయపడ్డారన్నారు. వారిలో ఇప్పటికే 21 మందిని డిశ్చార్జ్ చేశారని తెలిపారు. ఘటనకు కారణం ఏంటనేది విచారిస్తున్నామని తెలిపారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని అన్నారు. బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు.



**హైదరాబాద్ పరిధిలోని డివిజన్లకు బీజేపీ అధ్యక్షులతో పాటు జిల్లా కౌన్సిల్ మెంబెర్లను నియమించింది. ఈ మేరకు నూతన డివిజన్ అధ్యక్షుల పేర్లను బీజేపీ నగర కార్యాలయంలో గురువారం ప్రకటించారు. బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ముద్దంగుల శ్రీనివాస్ తిరిగి రెండోసారి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ముద్దంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని, తనను నమ్మి మరోసారి అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.**

- ప్రజానావ, ఖైరతాబాద్


## తొక్కిసలాటపై మంత్రుల విచారం

- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- మృతులకు 25 లక్షల పరిహారం



**ప్రజానావ, తిరుపతి:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశికి ముందు ఇలాంటి ఘటన దురదృష్టకరమని మంత్రులు అన్నారు. తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన వారికి ఏపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని మంత్రి వెల్లడించారు. తిరుపతి ఘటనలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులను రుయా ఆస్పత్రి వద్ద రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పార్థసారథి, ఆనం రామనాయణ రెడ్డి పరామర్శించారు. అనంతరం స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రులు పరామర్శించారు. ఆపై మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం అండంగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు మంత్రి అనగాని తెలిపారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. తిరుపతి ఘటనలో కుట్ర కోణం ఉందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నామని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే బాధ్యతారాహిత్యంగా పనిచేసిన వారిపై చర్యలు తప్పవని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయిన అనంతరం సొంతూర్లకు పంపుతామని, అలాగే గాయపడిన వారికి మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. కాగా.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సాధారణ భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన టోకెన్ కేంద్రాల వద్ద తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో ఊపిరాడక అనేక మంది అల్లాడిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా.. చాలా మంది గాయపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అవడంతో.. వారి వారి స్వగ్రామాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో పోలీసులు తరలించారు. అలాగే తొక్కిసలాటపై తిరుపతి పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. బైరాగిపట్టెడి రామానాయుడు స్కూల్ దగ్గర జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కోరారు.






**చర్యలు శూన్యం**

పేదోడి నిర్మాణాలపై నిమిషం కూడా ఆలోచించకుండా కూల్చివేస్తున్న అధికారులు, పెద్దోడి నిర్మాణాలను తాకేందుకు కూడా జంకుతున్నారని స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఫిర్యాదు చేసిన వారం రోజుల్లో సమాధానం రాకపోతే ఆ సర్కిల్‌కు చెందిన ఏసీపీ సదరు కట్టడాలను వెంటనే కూల్చివేయాలి. అయితే ఇక్కడ నోటీసులిచ్చి నెల రోజులు దాటినా జీహెచ్ఎంసీ సర్కిల్ 18 ఖైరతాబాద్ జోన్ ఏసీపీ మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమంగా చేపట్టిన టిన్ షెడ్ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై హైడ్రా కూడా స్పందించాలని కోరుతున్నారు.

# నోటీసులిచ్చినా తగ్గేదేలే!

## అనుమతి లేకుండానే అక్రమ కట్టడం

- ఖాళీ స్థలంలో వెలిసిన టిన్ షెడ్ల నిర్మాణం
- నోటీసులిచ్చి నెల దాటుతున్నా అటువైపే కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి సదరు నిర్మాణాలకు ముందస్తుగా టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులిస్తారు. నోటీస్ సమయం పూర్తయినప్పటికీ సరైన రీతిలో నిర్మాణదారుడి నుంచి స్పందన రాకపోతే ఆ నిర్మాణాన్ని కూల్చేయాలి. కానీ ఇక్కడ అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని.. కఠిన చర్యలు తీసుకుంటామని ఓవైపు హైడ్రా చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయి.

**ప్రజానావ, ఖైరతాబాద్:** జూబ్లీహిల్స్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నుంచి ముందస్తు అనుమతి లేకుండా ప్లాట్ నెం 915/బీ, రోడ్ నెం.46 పక్కన ఉన్న ప్రాంగణంలో ఓ భారీ టిన్ షెడ్ నిర్మాణం చేపడుతున్నారు. ఇది అక్రమ నిర్మాణమని స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో వెరిఫికేషన్ కోసం అనుమతి పత్రాలు, మంజూరు చేసిన ప్లాన్‌ను అందించమని నిర్మాణస్తుడికి అధికారులు గత నెల (డిసెంబర్ 2024) 4న నోటీస్ అందించారు. అధికారులిచ్చిన నోటీస్‌కు ఇంతవరకు సమాధానమివ్వని సదరు నిర్మాణాదారుడు తనకేం సంబంధం లేదన్నట్లు అధికారులిచ్చిన నోటీసుకు కనీసం సమాధానం కూడా చెప్పకపోగా, యథావిధిగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. మరోవైపు అక్కడ పనిచేసే సిబ్బంది సైతం ప్రమాదం అంచులో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

**నెల రోజులు ఆంక్షలు విధించిన సీపీ సుధీర్‌బాబు**

**ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**




**ప్రజానావ, హైదరాబాద్:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నెలరోజుల పాటు పోలీసులు ఆంక్షలు విధించారు. జనవరి 11 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిషేధం విధిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు ప్రకటించారు. ఈ ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారితో మహిళలు, మరి ముఖ్యంగా పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని సీపీ సుధీర్ బాబు తెలిపారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారిని మందుబాబులు మానసికంగా వేధిస్తున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. మందుబాబుల చేష్టలతో వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. కొంతమంది వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం సేవించి, సైకోల్లా ప్రవర్తిస్తూ మహిళలు, పిల్లల్లో భయాందోళన కలిగిస్తున్నారని సీపీ తెలిపారు. ఈ క్రమంలో మహిళలు, పిల్లలకు భద్రతా కల్పించాలనే ఉద్దేశంతోనే నెల రోజుల పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధం విధిస్తున్నట్టు సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.



# ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాంగ్రెస్ పాలన

**మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**ప్రజానావ, సికింద్రాబాద్:** ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని మేయర్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధ నగర్  డివిజన్‌లో పర్యటించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరంతా డివిజన్‌లో ఉన్న సమస్యలను స్థానికుల నుంచి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్ ఆదం సృజన్ కుమార్, స్థానిక కార్పొరేటర్ కంది శైలజ, డివిజన్ ప్రెసిడెంట్ అనిల్, బ్రహ్మాజీ, అమర్నాథ్ గౌడ్,  రాజు సాగర్, అభిషేక్, కిషోర్, రవి కుమార్, చక్రధర్, వైదుద్దీన్, చలం, షకిల్ ఖాన్, బబ్లూ, కార్తీక్, తుమ్మరాజు, హలీం, హుస్సేన్, మహేశ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి



## ఇంటర్మీడియట్ బోర్డు అబ్జర్వర్ వసుంధర

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఇంటర్మీడియట్ బోర్డు హైదరాబాద్ నుంచి బోర్డ్ అబ్జర్వర్ వసుంధర సందర్శించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తునందున విద్యార్థులు అందరూ ప్రణాళికయితంగా చదివి ఉత్తమ ఫలితాల సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని వాటికి అనుగుణంగా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సూచించిన 90 రోజుల ప్రణాళిక ప్రకారం 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి లెక్చరర్స్ రిపోర్టులను వారి సిలబస్ ప్రణాళికలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు భూమేశ్, సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక రుగ్మతలపై అవగాహన




**ప్రజానావ, సిరిసిల్ల:** కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. రజిత రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో బద్దెనపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో గురువారం డా. ప్రవీణ్ కుమార్ మానసిక వైద్య నిపుణులు విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడి లేకుండా మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మానసికంగా బాధపడుతున్న విద్యార్థులకు ధైర్యం కలిగించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, విద్యార్థులు పరీక్షా సమయంలో మానసికంగా బాధ పడకుండా ఉండడం గురించి సలహాలు, సూచనలిచ్చారు.

# మండల అధ్యక్షుడిగా రమేశ్



**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** తెలంగాణ దివ్యాంగుల సమితి వెంకటాపూర్ మండల అధ్యక్షుడిగా కందికొండ రమేశ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షులు మున్నాభాయ్ ఆదేశానుసారం తెలంగాణ దివ్యాంగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు పెద్దబోయిన శ్రీనివాస్ ఈ ఎన్నికను ప్రకటించారు. లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన కందికొండ రమేష్ వెంకటాపూర్ మండల తెలంగాణ దివ్యాంగుల సమితి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారు అన్నారు. తన ఎన్నికకు మద్దతు తెలిపిన వారందరికీ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.


# కుంగ్‌ఫూ, కరాటేలో పతకాలు



**ప్రజానావ, గన్నేరువరం:** డ్రాగన్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఆదివారం మంచిర్యాల జిల్లాలోని సోమగూడెంలో జరిగిన కుంగ్‌ఫూ, కరాటే  రాష్ట్రస్థాయి పోటీల్లో గన్నేరువరం మండల పరిధిలోని గుండ్లపల్లిలోని ఎస్ఎల్ఎన్ స్పార్కిల్ స్కూల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి ఐదు బంగారు పతకాలు, వెండి పతకం సాధించారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థులు శివ, ఆదిత్య, శశి, ధనుష్, శివాని బంగారు పతకాలు, భావజ్ఞ వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అంజనేయులు , కరస్పాండెంట్ సంపత్, అకాడమీక్ డైరెక్టర్ సతీష్, కరాటే మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఉపాద్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# శ్రీవారి సేవ ట్రస్ట్ నూతన కమిటీ

**అధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్**



**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి సేవ చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా నార్ల నాగభూషణం, అధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా మంచాల వరప్రసాద్, సహ ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా మండల లక్ష్మి, సభ్యులుగా నార్ల ప్రకాశ్, దేవసాని రాజమౌళి, భత్తుల రమేశ్, పెద్ది వెంకటేశ్, అవగాహన కార్తీక్, రాజ్ కుమార్ అగర్వాల్, కన్నం మల్లేశ్వరి, మంచాల జ్యోతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఏర్పడిన నిమిషాల్లోనే ఆలయ అభివృద్ధికి రూ.50లక్షల విరాళాలు ఇచ్చేందుకు కొంతమంది ప్రముఖులు ముందుకొచ్చారని తెలిపారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం తర్వాత పెద్దపల్లి దేవస్థానాన్ని చూడాలనిపించే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గుడి లోపల, బయట సౌకర్యాలు అన్నివిధాలా ఉండేట్టు కమిటీ ద్వారా అభివృద్ధి చేస్తామని కమిటీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.

# డైరీ, క్యాలండర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజానావ, పెద్దపల్లి:** ఎల్ఐసీ డైరీ, క్యాలెండర్‌ను గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. ఎల్ఐసీ ఏజెంట్ పోసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీలు, క్యాలెండర్లను జిల్లా కలెక్టరేట్ లో విడుదల చేసి పంపిణీ చేశారు. బీమా రంగంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎల్ఐసీ బీమా సంస్థ ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. పాలసీదారులకు ఎల్ఐసీ మెరుగైన సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ

- వివిధ పోటీ పరీక్షల్లో రాణించేలా తర్ఫీదు
- రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జిల్లాలోని కేజీబీవీల్లో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రారంభం
- ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్



**ప్రజానావ, రుద్రంగి/చందుర్తి/వేములవాడ రూరల్:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించామని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఐఐటీ, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి, చందుర్తి, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి కేజీబీవీల్లో విద్యార్థినులకు ఐఐటీ, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చందుర్తి, మర్రిపల్లి లోని పాఠశాలలో స్టోర్ రూం, వంటగదిలను, భోజనశాలను వారిద్దరు కలిసి పరిశీలించారు. నిత్యవసరాలను, బియ్యం, కూరగాయలను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. చందుర్తిలో టాయిలెట్స్ నిర్మాణం చేపడతామని విప్ పేర్కొన్నారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు, గడ్డి వంటి వాటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చందుర్తి కేజీబీవీ పాఠశాలకు నూతన రంగులు వేయాల్సిందిగా ఆదేశించారు. విద్యార్థులను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రుద్రంగిలోని కేజీబీవీలో ఇప్పటికే ప్రహరీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయనీ విప్ చెప్పారు.

### సద్వినియోగించుకోవాలి..

ఉపాధ్యాయులు చెప్పేది వింటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు పోవాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం నాణ్యమైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తుందని తెలిపారు. విద్యా రంగానికి పెద్ద పీట వేస్తూ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను చేపట్టినని తెలిపారు. శిక్షణ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధిస్తే స్వయానా వచ్చి సన్మానం చేస్తానని హామీ ఇచ్చారు.

### ప్రభుత్వ సహాయంతో.. కలెక్టర్ చొరవతో..

ఐఐటి, జేఈఈ,నీట్ యూజీ ఫౌండేషన్ కోర్సులను జిల్లాలోని కేజీబీవీపీలలో అందించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాల ల్లో ఇచ్చే కోచింగ్ ప్రభుత్వ సహాయంతో కేజీబీవి లో అందిస్తున్నామని వివరించారు. తాను మధ్యతరగతి కుటుంబం నుండి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. ఈ కోర్సుల వలన మధ్యతరగతి కుటుంబాలలోని విద్యార్థులకు ప్రవేట్ పాఠశాలలో కోచింగ్ సెంటర్లలో లభించే కోచింగ్ కేజీబీవీ లలో లభిస్తుందని, వారు అనుకున్న లక్ష్యాలు చేరుకునే మంచి అవకాశం ఉ ఒందని తెలిపారు. దేశంలోనే ఉత్తమ సంస్థల్లో అందించే కోచింగ్ ను ఇక్కడ అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, రుద్రంగి, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు చేలకల తిరుపతి, రోండి రాజు, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులున్నారు.

### జిల్లాలో 13 కేజీబీవీల్లో అమలు


రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 కేజీబీవీల్లో అమలు చేస్తున్నామని విప్ వెల్లడించారు. ఐఐటీ, జేఈఈ, నీట్, యూజీ ఫౌండేషన్ కోర్సులను ఆన్‌లైన్ కోచింగ్ , లైవ్ క్లాసెస్ చెప్పి, విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి అవకాశం, వారంతరాల్లో టెస్టులు నిర్వహిస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేజీబీవీలలో ఆన్లైన్ క్లాసులు ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. ఢిల్లీ, హైద్రాబాద్, రాజస్థాన్, కోట లలో ఇచ్చే కోచింగ్ అన్ అకాడమీ సౌజన్యంతో ముందుకు పోతున్నారనీ తెలిపారు. కోచింగ్ సద్వినియోగం చేసుకొని ఐఐటీ, జేఈఈ, నీట్‌లలో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే విద్యార్థులందరికీ ఒకే రకమైన నాణ్యమైన రుచికరమైన పౌష్టిక ఆహారం అందించడానికి ఒకే మెను తయారుచేసి అందిస్తున్నామని వివరించారు.

## గాయత్రిలో ముందస్తు 'సంక్రాంతి'




**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో గురువారం ప్రైమరీ విద్యార్థులు సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ - రజనీ దేవి దంపతులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతరించిపోతున్న మన తెలుగు పండగలు, వాటికి సంబంధించిన సంప్రదాయాలు నేటి తరం పిల్లలకు కూడా తెలియపరచి మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే తమ పాఠశాలలో సందర్భానుసారం ప్రతీ పండగను నిర్వహిస్తూ, వాటి విశిష్టత, నిర్వహించుకునే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు తెలిపి, భోగి పండగ, సంక్రాంతి, కనుమ పండగల విశిష్టతను చక్కగా వివరించారు. అందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన నృత్యాలు, హరిదాసు, గోదాదేవి, గంగిరెద్దుల వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన భోగి మంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయినీల బృందం పాటలకు అనుగుణంగా నృత్యం చేయడం అందరినీ ఆకర్షించింది. కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ కూడా పిల్లలలో కలిసి నృత్యం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## ఉత్సవ కమిటీ చైర్మన్‌కు సన్మానం



**ప్రజానావ, చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గా హుస్నాబాద్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చొల్లేటి శంకరయ్యను నియమించడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆర్యవైశ్య సంఘం నాయకులు మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్, అన్నప్రసాద వితరణ ట్రస్ట్ అధ్యక్షుడు చందా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ శంకరయ్యకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి, స్వామి వారి భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన కమిటీ ఐక్యతతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, అన్నప్రసాద వితరణ ట్రస్ట్ అధ్యక్షుడు చందా శ్రీనివాస్, హుస్నాబాద్ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు బాలకిష్టయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండే రాజు, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తెరాల మారుతి, చిగురుమామిడి కాంగ్రెస్ నాయకులు చిట్టుమల్ల రవీందర్ తదితరులున్నారు.

## 'యంగ్ ఇండియా కె బోల్' పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజానావ, కరీంనగర్:** యువ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కె బోల్' కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం యువత గొంతుకలను ప్రోత్సహించడం కోసం రూపుదిద్దుకుంది. ముఖ్యంగా యువత దేశంలోని ప్రజాస్వామ్య విధానాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు రూపొందించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్యం శంకర్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, 'యంగ్ ఇండియా కె బోల్' వంటి కార్యక్రమాలు తదుపరి తరాల నాయకులను రూపొందించడంలో కీలకమని అన్నారు. యువతకు వివిధ జాతీయ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ఒక వేదికను అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి



**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రాజమొగిలి రైతుకి చెందిన ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. రైతు ఇంటి పరిసర ప్రాంతంలో ఆవు మేత కోసం తిరుగుతున్న సమయంలో ఆహారం తీసుకునే క్రమంలో విద్యుత్ తీగ తెగి మీద పడటంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేలు విలువ చేసే ఆవు విద్యుదాఘాతంతో మరణించడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. బాధిత రైతుకు సంబంధిత శాఖ నుంచి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

## ఆధ్యాత్మిక శోభతో జాతర నిర్వహించాలి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజానావ, కోనరావుపేట:** మాఘా అమావాస్య జాతర కు ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్త దేవాలయం శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నందు మాఘా అమావాస్య జాతర సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. జనవరి 29 రోజున మాఘ అమావాస్య జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశ్ రావు, ఎంపీడీవో శంకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచకాల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, గొట్టే రుక్మిణి, చేపూరి గంగాధర్, ఆలయ కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవో గౌరవాధ్యక్షుడు సమర సేన్, అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం సాగర్, కోశాధికారి సీహెచ్. విశ్వన్, ఉపాధ్యక్షులు బీ. శ్రీకాంత్, అజహరుద్దీన్, జాయింట్ సెక్రటరీ వంశీ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బీ. అరవింద్ పాల్గొన్నారు.
- ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో

## టెడ్ ఎడ్ క్లబ్ ప్రారంభించిన కలెక్టర్



**ప్రజానావ, గన్నేరువరం:** గన్నేరువరం మండలం జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెడ్ ఎడ్ క్లబ్‌ను గురువారం కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. విద్యార్థినులు ఇంగ్లీష్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో టెడ్ ఎడ్ క్లబ్ లైసెన్స్ జంగపల్లి ప్రభుత్వ పాఠశాలకు రావడం గర్వకారణం అన్నారు. పాఠశాలలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను వీక్షించారు. విద్యార్థుల టెడ్ టాక్స్ ను చూసి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈవో జనార్ధన్ రావు, తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎస్ఓ అశోక్ రెడ్డి, ఎంఈఓ రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలుడి వైద్యానికి కలెక్టర్ సాయం

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** బాలుడి వైద్యానికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా కు చెందిన రమావత్ చందు కొడుకు రమావత్ రోహిత్ ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలోని బీసీ సంక్షేమ హాస్టల్లో చదువుతున్నాడు. ఇటీవల పాముకాటుతో గాయపడి దవాఖానాలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చులకు సంబంధించి రూ. 1 లక్ష 50 వేల రూపాయల చెక్కును రమావత్ చందు భార్య రజిత కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం అందజేశారు. అలాగే విద్యార్థికి పదో తరగతి దాకా మెరుగైన విద్యను అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.




కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామంలోని స్థానిక తెలంగాణ అల్ప సంఖ్యాకుల బాలికల గురుకుల పాఠశాలలో 194 వ ముస్లిం తొలి మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫతిమా జయంతిని పురస్కరించుకొని పాఠశాలలోని ఉపాధ్యాయురాళ్లను గురువారం శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మమ్మద్ హసీనాతో పాటు ఐలా ప్రసన్న, ఊరడి లత, జ్యోతిరెడ్డి, శిల్ప, సరిత, సఫియా, తిరుపతమ్మ, వాణి, భాగ్య, రాచపల్లి ప్రసాద్, శివ ప్రసాద్, పొత్తూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రజానావ, కరీంనగర్

## అంబులెన్స్ లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

ప్రజానావ, ములుగు: ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం నూగూరు కాలనీలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి మడకం సునీత ను 108 అంబులెన్స్ ద్వారా వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువస్తుండగా మార్గం మధ్యలో వెదుళ్ల చెరువు సమీప ప్రాంతంలో 108 సిబ్బంది డెలివరీ చేయగా పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉందని, వారిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు చెప్పారు. సమయానికి సహకరించిన 108 సిబ్బంది ఈఎంటీ వినోద్, పైలట్ నదీర్ బాషాలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

శుక్రవారం
10 జనవరి 2025



# ఇంగ్లండ్ సిరీస్‌తో జట్టులోకి
# షమీ రీఎంట్రీ!

## వైద్య బృందం పర్యవేక్షణలో షమీ



**ముంబై:** టీమ్ఇండియా అభిమానులకు గుడ్ న్యూస్. ఛాంపియన్స్ ట్రోఫీ కంటే ముందు జరిగే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు టీమ్ఇండియా పేసర్ మహ్మద్ షమీ అందుబాటులో ఉంటాడని తెలుస్తోంది. 2023 నవంబరులో జరిగిన ప్రపంచకప్ ఫైనల్ తర్వాత జట్టుకు దూరంగా షమీ ఇంగ్లండ్‌తో సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, ఫిబ్రవరి 6 నుంచి భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. కుడి మడమకు శస్త్రచికిత్స చేయించుకున్న షమీని నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం నిశితంగా పరిశీలిస్తోందని సమాచారం. మడమ గాయం నయమైనా, మోకాలిలో స్వల్ప వాపు ఉండటం వల్లే బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి అతడ్ని ఎంపిక చేయలేదట. షమీ పూర్తిగా గాయం నుంచి కోలుకుంటే ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసే జట్టులో అతడికి చోటు దక్కనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) వైద్య బృందం నిశిత పరిశీలనలో షమీ ఉన్నాడు. షమీతో నిత్యం ఒక ఎన్‌సీఏ ఫిజియో లేదా ట్రైనర్ ఉంటున్నారట. రాజ్‌కోట్‌లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడినప్పుడు కూడా షమీతో ఫిజియో వెళ్లారట. ఇంగ్లండ్ తో జరిగే వన్డేలు, టీ20 సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ఎంపిక చేయడానికి జనవరి 12న బీసీసీఐ సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. జనవరి 22– ఫిబ్రవరి 2 వరకు ఇంగ్లాండ్‌తో భారత్ 5 టీ20లు ఆడనుంది. ఆ తర్వాత 3 వన్డేలు ఆడనుంది. టీమ్ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ దాదాపు 417 రోజులుగా అంతర్జాతీయ క్రికెట్?కు దూరంగా ఉన్నాడు. చివరిగా వన్డే వరల్డ్‌కప్ 2023లో ఆడాడు. మెగా టోర్నీలో చీలమండ గాయమవ్వడం వల్ల లండన్ వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ తర్వాత కోలుకొని ఫిట్ నెస్ సాధించి దేశవాళీ క్రికెట్ ఆడటం మొదలుపెట్టాడు. నిజానికి బోర్డర్–గవాస్కర్ ట్రోఫీకి షమీని ఎంపిక చేయాలని సెలక్టర్లు భావించారు. కానీ, మోకాలిలో వాపు రావడం వల్ల పక్కన పెట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా కోలుకోవడం వల్ల త్వరలో జరగబోయే ఇంగ్లండ్ సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీకి షమీని సెలక్టర్లు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



# అన్ని ఫార్మాట్లలో బుమ్రానే బెస్ట్

### ఆసీస్ మాజీ కెప్టెన్ క్లార్క్ ప్రశంసలు

**మెల్‌బోర్న్:** బోర్డర్– గావస్కర్ ట్రోఫీని భారత్ చేజార్చుకున్నప్పటికీ, టీమ్?ఇండియా పేసర్ జస్ప్రీత్? బుమ్రా అద్భుత సూపర్ పెర్ఫామెన్స్?తో ఆకట్టుకున్నాడు. ఈ సిరీస్?లో మొత్తం 32 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన అతడిపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఆసీస్ మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ కూడా బుమ్రాపై ప్రశంసలు కురిపించాడు. అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ బౌలర్ బుమ్రా అని కొనియాడాడు. బోర్డర్– గావస్కర్ ట్రోఫీ ముగిసిన తర్వాత బుమ్రా పెర్ఫామెన్స్ గురించి తాను ఆలోచించానని క్లార్క్ తెలిపాడు. అన్ని ఫార్మాట్లలో బుమ్రానే అత్యుత్తమ బౌలర్ అని అభిప్రాయపడ్డాడు. "చాలా మంది గొప్ప ఫాస్ట్ బౌలర్లు నాకు తెలుసు. గ్లెన్ మెక్‌గ్రాత్, ఆంబ్రోస్ లాంటి వారు ఉన్నా, వారు టీ20 ఫార్మాట్లో ఆడలేదు. అందుకే నేను బుమ్రా పేరు చెబుతున్నాను. ఎలాంటి పరిస్థితుల్లోనైనా, ఎలాంటి ఫార్మాటైనా బుమ్రా అదరగొడతాడు. అదే అతడిని గొప్ప బౌలర్‌గా మార్చింది. బుమ్రా జట్టులో ఉంటే సిడ్నీ టెస్టు భారత్ గెలుస్తుందని నేను అనుకున్నాను. టీమ్ఇండియాలోని ఇతర బౌలర్ల కంటే బుమ్రా చాలా మెరుగ్గా ఉన్నాడు." అని క్లార్క్ బుమ్రా ప్రశంసలతో ముంచెత్తాడు. బుమ్రాపై ఆసీస్ మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ సైతం ప్రశంసలు కురిపించాడు. బోర్డర్– గావస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ లో గాయం కారణంగా బుమ్రా మైదానంలోకి దిగలేదు. ఒకవేళ అతడు బౌలింగ్ చేసి ఉంటే పరిస్థితి ఇంకోలా ఉండేదని ఫించ్ అభిప్రాయపడ్డాడు. 'సిడ్నీ టెస్టు చివరి ఇన్నింగ్స్ లో బుమ్రా బౌలింగ్ చేసి ఉంటే ఆస్ట్రేలియా పరిస్థితి ఎలా ఉండేది? ఆసీస్ గెలిచింది కానీ, పరిస్థితి అనుకున్నదానికంటే క్లిష్టంగా మారేది" అని ఫించ్ పేర్కొన్నాడు. బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భారత పేసర్ 5 టెస్టుల్లో 32 వికెట్లు తీశాడు. దీంతో అతడిని 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది. అలాగే రెండు టెస్టులకు టీమ్?కు సారథ్యం వహించిన బుమ్రా ఒక గెలుపును జట్టుకు అందించాడు. ఈ క్రమంలో బుమ్రా బౌలింగ్?తో పాటు కెప్టెన్సీపై కూడా పలువురు ప్రశంసలు కురిపించారు. కాగా, బోర్డర్– గావస్కర్ ట్రోఫీని 1–3 తేడాతో భారత్ చేజార్చుకుంది.

### ఒకే ఓవర్ లో 7 ఫోర్లతో
# రాణించిన నారాయణ్ జగదీశన్

**వడోదరా:** తమిళనాడు ఓపెనర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ మరోసారి వార్తల్లో నిలిచా డు. ప్రస్తుతం జరుగుతోన్న విజయ్ హజారే ట్రోఫీలో తన అద్భుతమైన ప్రదర్శనతో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. రాజస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో జగదీశన్ ఒకే ఓవర్ లో వరుసగా 6 ఫోర్లు బాది అందర్నీ ఆశ్చర్యపరిశాడు. బరోడా వేదికగా ఈ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ పోరులో తొలి ఇన్నింగ్స్ లో రాజస్థాన్ 267 పరుగులు చేసింది. అనంతరం 268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన తమిళనాడు జట్టులో జగదీశన్ స్టన్నింగ్ పెర్ ఫార్మెన్స్ చేశాడు. రాజస్థాన్ పేసర్ అమన్ సింగ్ షెకావత్ వేసిన రెండో ఓవర్ లో 29 పరుగులు చేశాడు. ఈ ఓవర్ లో తొలి బంతి వైడ్ వేయగా అది బౌండరీ వెళ్లింది. అలా వైడ్ డెలివరీ బౌండరీతో మొదలైన ఈ ఓవర్ లో జగదీశన్ ఆధిపత్యం ప్రదర్శిస్తూ వరుసగా ఆరు ఫోర్లు బాదేశాడు. ఈ క్రమంలోనే కేవలం 33 బంతుల్లో 9 ఫోర్ల సాయంతో హాఫ్ సెంచరీ మార్క్ ను కూడా టచ్ చేశాడు. మొత్తంగా 52 బంతుల్లో 65 పరుగులు చేశాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో తెగ వైరల్ అవుతున్నాయి. కాగా, తమిళనాడు వికెట్‌కీపర్, ఓపెనర్ అయిన జగదీశన్ 2018 నుంచి 2022 వరకు ధోనీ గైడెన్స్ లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. లిస్ట్–ఏ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ (277) చేసిన రికార్డు ను తన పేరిట రాసుకున్నాడు జగదీశన్. ఇతడిని 2023 ఐపీఎల్ ఆక్షన్ లో కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు రూ. 90 లక్షలకు దక్కించుకుంది. ఇక 2024, 2025 సీజన్ లో జగదీశన్‌ను కొనుగో లు చేసేందుకు ఏ ఫ్రాంచైజీ కూడా ఆసక్తి చూపలేదు. మొత్తంగా ఐపీఎల్‌లో 13 మ్యాచ్‌లు ఆడిన జగదీశన్ 110.20 స్ట్రైక్ రేట్ తో 162 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇక తాజాగా జరిగిన మ్యాచ్ విషయానికొస్తే, మొదట బ్యాటింగ్ కు దిగిన రాజస్థాన్ 47.3 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌట్ అయింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు పడగొట్టి రాజస్థాన్‌ను గట్టిగా అడ్డుకున్నాడు. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అభిజీత్ తోమర్ (125 బంతుల్లో 111 బీ 12 ఫోర్లు, 4 సిక్సర్లు) శతకంతో, సారథి మహిపాల్ లోమ్రార్ (49 బంతుల్లో 60బీ 3 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో మెరిశారు.






### బెంగాల్ జట్టు ఆటగాళ్లకు
# గుడ్ న్యూస్

### భారీ నజరాను ప్రకటించిన బెంగాల్ ప్రభుత్వం

**కోల్‌కతా:** రీసెంట్‌గా జరిగిన ఓ ప్రతిష్టాత్మక ట్రోఫీలో ఆ జట్టు రికార్డ్ స్థాయిలో 33వ సారి విజయాన్ని అందుకుంది. దీంతో ప్రభుత్వం ఆ జట్టులోని 22 మంది ఆటగాళ్లకు భారీ నజరానాతో పాటు పోలీస్ ఉద్యోగాలను ప్రకటించింది. సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ ను ముద్దాడిన బెంగాల్ జట్టు ఆటగాళ్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారికి భారీ నజరాను ప్రకటించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను అందించనున్నట్లు తెలిపింది. ఈ నేషనల్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ టోర్నీలో బెంగాల్ జట్టు రికార్డు స్థాయిలో 33వసారి ట్రోఫీని గెలుచుకుంది. ఈ సందర్భంగా గెలిచిన జట్టులోని ఆటగాళ్లకు పోలీస్ విభాగంలో ఉద్యోగాలను ఇస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ప్లేయర్స్ ను అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్‌ఐ)లుగా నియమించనున్నట్లు తెలిపింది. సంతోష్ ట్రోఫీ విజేతలకు తాజా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ ఈ విషయాన్ని అధికారికంగా తెలిపారు. జట్టులోని మొత్తం 22 మంది ఆటగాళ్లకు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలకు సంబంధించిన ప్రక్రియ కూడా పూర్తైందని చెప్పుకొచ్చారు. ఇంకా జట్టులోని సభ్యులందరికీ రూ.50 లక్షల నజరానా కూడా ప్రకటించారు. కాగా, ఇటీవలే హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా సంతోష్ ట్రోఫీ ఫైనల్ జరిగింది. ఈ తుది పోరులో 1–0 తేడాతో కేరళను ఓడించి బెంగాల్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ రికార్డు స్థాయిలో 33వ సారి ప్రతిష్టాత్మక సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచింది. వాస్తవానికి ఈ తుదిపోరులో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్తుందేమో అని అంతా అనుకున్నారు. కానీ ఇంజూరీ సమయంలో రాబి (94వ) బంతిని నెట్‌లోకి కొట్టి బెంగాల్ కు విజయాన్ని ఖాయం చేశాడు. ఆదిత్య హెడర్‌తో బంతిని రాబి సమీపానికి పంపాడు. దీంతో అతడు వెంటనే గోల్ చేసేశాడు.



### మీడియాలో వస్తోన్న వార్తలతో
# మానసిక వేదనకు గురౌతున్నా

### సోషల్ మీడియాలో పోస్టులపై చాహల్ భార్య ధనశ్రీ

**ముంబై:** టీమిండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొంతకాలంగా ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ధనశ్రీ పెట్టిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకీ ఆమె ఏం చెప్పిందంటే చాహల్ – ధనశ్రీవర్మ 2020లో వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అయితే గత కొన్ని రోజులుగా చాహల్, ధనశ్రీ దంపతులు విడిపోతున్నారంటూ మీడియాలో వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. ఎందుకంటే వీరిద్దరూ ఒకరి నొకరు ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేసుకోవడంతో పాటు చాహల్ తన ఖాతా నుంచి భార్య ఫొటోలను తొలగించడంతో ఈ ఊహాగానాలు మరింత ఎక్కువయ్యాయి. వాస్తవానికి చాహల్ జంట సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. కానీ ఆ తర్వాత ఈ జంట పెట్టిన పోస్టులు అభిమానులను గందర గోళానికి గురి చేశాయి. దీంతో వీరిద్దరు విడాకులు తీసుకోబోతున్నారంటూ వార్తలు గట్టిగా వచ్చాయి. ఈ క్రమంలోనే దీనిపై స్పందించిన చాహల్, తాము విడిపోవడం లేదని స్పష్టత ఇచ్చాడు. కానీ మళ్లీ వీరిద్దరి మధ్య ఏమైందో స్పష్టంగా తెలీదు కానీ, ఈ జంట చేసిన కొన్ని చర్యల వల్ల వీరి విడుపోతున్నారనే ప్రచారం మరోసారి మొదలైంది. ఈ క్రమంలోనే తాజాగా ధనశ్రీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. కొన్ని రోజులుగా మీడియాలో వస్తోన్న వార్తల వల్ల తాను మానసిక వేదనకు గురౌతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. "గత కొద్ది రోజులుగా నేను, నా ఫ్యామిలీ కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. నిజా నిజాలు తెలుసుకోకుండానే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. నాపై ద్వేషం కలిగేలా సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. నిజంగా ఈ విషయం నన్ చాలా బాధిస్తోంది. ఈ స్థాయికి రావడానికి నేను ఎన్నో ఏళ్లుగా శ్ర మిస్తున్నాను. నేను మౌనంగా ఉన్నానంటే దానర్థం బలహీనంగా ఉన్నట్లు కాదు. సోషల్ మీ డియాలో నెగటివిటీ ఉన్నప్పటికీ ఇతరులపై కరుణ చూపాలంటే ధైర్యం ఎంతో అవసరం. నేను వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విలువలతో ముందుకు సాగుతున్నాను. ఎప్పటికైనా నిజమే విజయం సాధిస్తుంది. దాన్ని సమర్థించుకోవాల్సిన అవసరం లేదు" అని ధనశ్రీ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది.

# ఆసక్తి రేకిస్తున్న అనూ ఇమ్మ్యాన్యుయేల్ లుక్



మజ్ను సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలుకరించింది అనూ ఇమ్మ్యాన్యుయేల్. తెలుగులో గోపీచంద్, అల్లు అర్జున్, పవన్ కల్యాణ్, రవితేజ లాంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసిన ఈ యూనైటెడ్ స్టేట్స్ భామ పాపులర్ సినిమాటోగ్రఫర్ ఆండ్రీవ్ బాబు దర్శకత్వంలో సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి బూమరాంగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. చీకట్లో ఉన్న ఓ ఇంటి ముందు డెడ్‌బాడీలు కనిపిస్తుండగా.. ఓ వ్యక్తి వాటి మధ్యలో నుంచి కుక్కను పట్టుకుని వస్తుండటం చూడొచ్చు. మరోవైపు అనూ ఇమ్మ్యాన్యుయేల్ షాకింగ్‌లో ఉన్నట్టు కనిపిస్తుంది. మొత్తానికి ఈ సారి ఏదో సస్పెన్స్ స్టోరీతో పక్కా హిట్ కొట్టేందుకు రెడీ అవుతుందని అర్థమవుతోంది. ఈ చిత్రంతో ఆండ్రీవ్ బాబు దర్శకు డిగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఆండ్రీవ్ బాబు ఈ చిత్రానికి కెమెరామెన్‌గా కూడా పనిచేస్తుండటం విశేషం. యూనిక్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీలో శివ కందుకూరి లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. వెన్నెల కిశోర్, వైవా హర్ష ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మై3 ఆర్ట్స్ బ్యానర్లపై లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి ఊట్ల నిర్మిస్తున్నారు. సితార ఫిలిమ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్ పనులు చూసుకోనుంది. రెండు స్టోరీ లైన్స్ ఆధారంగా కర్మ థీమ్‌తో సమాంతరంగా థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే తెలియ జేశారు. లండన్‌లోని అందమైన లొకేషన్లలో కొనసాగుతోంది. ఆండ్రీవ్ బాబు రామ్ నటించిన కందిరీగ, ఎందుకంటే ప్రేమంటే, సాయి దుర్గ తేజ్ నటించిన తేజ్ ఐ లవ్ యూ చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేశాడు. గతేడాది రవితేజ రావణాసుర, కార్తీతో జపాన్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. దీంతో తన ఆశలన్నీ ఈ సినిమాపైనే పెట్టుకుంది అనూ ఇమ్మ్యాన్యుయేల్.

# బీటౌన్ హీరో, శ్రీలీల డేటింగ్ ఫొటోలు

శ్రీలీల ఈ పేరు తెలియని వారు ఉండరు. పెళ్లి సందడి చిత్రంతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొన్ని నెలల క్రితం వరకు వరుస ఫ్లాప్స్ చూసి.. ఇక శ్రీలీల పని అయిపోయింది అనుకున్నారు అంతా. కానీ, ఇటీవలే రిలీజైన 'పుష్ప 2'లో ఆమె చేసిన 'కిస్సిక్' సాంగ్‌తో నేషనల్ వైడ్‌గా విపరీతమైన క్రేజ్‌ని సొంతం చేసుకుంది. ఈ సాంగ్ తర్వాత ఆమెను అంతా శ్రీలీలకు బదులు 'కిస్సిక్ లీల' అని పిలుస్తున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీలీలకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం నెట్టింట షేక్ చేసేస్తోంది. ఆమె ఓ బాలీవుడ్ హీరోతో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది శ్రీలీల తాజాగా ముంబైలో దర్శనమిచ్చింది. అక్కడ ఓ రెస్టారెంట్‌లో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్‌తో కలిసి కనిపించింది. వీరిద్దరూ రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చిన అనంతరం మీడియాకి ఫోజులు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు వీరిద్దరూ కలుసుకోవడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వీరు ఇప్పుడు ఎందుకు కలుసుకున్నారు..? ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారా..? అంటూ చర్చించుకుంటున్నారు. అయితే, మూవీ విషయమై ఆమె ముంబైకి వెళ్లినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నారు. అక్కడ అనుకోకుండా ఇబ్రహీంని కలుసుకుందని చెబుతున్నారు. అంతకు మించి వారిద్దరి మధ్యా ఎలాంటి రిలేషన్‌షిప్ లేదని అంటున్నారు. అదే సమయంలో ఇబ్రహీం ఖాన్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇబ్రహీం సినిమాలో శ్రీలీలను నటిగా ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ గురించి చర్చల్లో భాగంగానే ఇద్దరూ కలిసినట్లు టాక్ వినిపిస్తోంది. మరోవైపు శ్రీలీల ప్రస్తుతం నితిన్‌తో కలిసి రాబిన్ హుడ్, పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాల్లో నటిస్తోంది. వీటితోపాటు %=%75 ప్రాజెక్ట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



# ఎమర్జెన్సీ విషయంలో నేను చేసిన పెద్ద తప్పు అదే : కంగనా

బాలీవుడ్ క్వీన్, మండి ఎంపీ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ' . 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమాలో కంగనా రనౌత్.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించింది. ఆమె దర్శకురాలు కూడా. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ చిత్రం.. పలు వివాదాల కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఎట్టకేలకు తాజాగా ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రం విషయంలో తాను కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమర్జెన్సీ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయకుండా ఉండాల్సిందని.. అది తాను చేసిన పెద్ద తప్పు అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడం, సినిమా విడుదల ఆలస్యం కావడం వల్ల తాను చాలా బాధపడ్డట్లు తెలిపింది. డైరెక్ట్‌గా ఓటీటీలోకి వెళ్లుంటే మంచి డీల్ దొరికేదని అభిప్రాయపడ్డారు. అప్పుడు సెన్సార్ బాధలు కూడా ఉండేవి కావన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించాలనుకోవడం తాను చేసిన మొదటితప్పుగా కంగన చెప్పుకొచ్చారు. ఇందిరా గాంధీ మూడు పర్యాయాలు ప్రధానిగా చేశారని.. ఆ సమయంలో ఎన్నో ఘటనలు చేటుచేసుకున్నట్లు గుర్తు చేశారు. గతంలో ఇందిరా గాంధీపై 'కిస్సా కుర్సీ కా' మూవీ వచ్చిందని తెలిపారు. ఆ చిత్రాన్ని ఎవరూ చూడలేదని.. అందుకు కారణం రిలీజ్ కాకుండానే ఆ చిత్రాన్ని బ్యాన్ చేశారన్నారు. ఆ చిత్రానికి సంబంధించిన ఫైల్స్ కూడా దగ్ధం చేసినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇందిరా గాంధీపై ఏ ఒక్కరూ సినిమా తీసే ధైర్యం చేయలేదన్నారు. ఇప్పుడు ఈ సినిమా చూశాకా నేటి తరం వారికి ఇందిరా గాంధీ మూడుసార్లు ప్రధాని ఎలా అయ్యారో తెలుస్తుందని చెప్పుకొచ్చారు.



# నిధి అగర్వాల్‌కు వేధింపులు..

'సవ్యసాచి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన అందం, అభినయంతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నది. దీంతో ఈ చిన్నదానికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా 'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో నటించి ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ భామ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాతో పాటు, ప్రభాస్ సరసన 'రాజా సాబ్' మూవీలో నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ నిత్యం యాక్టీవ్‌గా ఉంటూ తన అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన ఓ న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. సామాన్య ప్రజల నుంచి సెలబ్రిటీల వరకు ఆకతాయిల నుంచి వేధింపులు కూడా పెరుగుతూనే ఉన్నాయి. నేపథ్యంలో హీరోయిన్ నిధి అగర్వాల్‌కు కూడా వేధింపులు ఎదురయ్యాయి. దాంతో సోషల్ మీడియా ద్వారా తనను వేధిస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్‌లో కంప్లైట్ చేసింది. ఇక కంప్లైంట్‌లో.. ఆ వ్యక్తి నన్ను చంపేస్తానని సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నాడని పేర్కొంది. అలాగే తనతో పాటు తనకు ఇష్టమైన వారిని, తన ఫ్యామిలీని టార్గెట్ చేస్తూ బెదిరింపులు పాల్పడుతున్నాడని, ఆ వ్యక్తి వల్ల ఒత్తిడికి లోనవుతున్నాని, సదరు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రస్తుతం సైబర్ క్రైమ్ పోలీసులు ఈ భామ కంప్లైంట్ తీసుకుని, విచారణ చేపట్టారు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**